
సాక్షి ఒడిశా

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,77,575
బంగారం 5 గ్రాముల 350 మిల్లీ గ్రాములు
వెండి 13 గ్రాముల 650 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వరములివ్వు వినాయక

ఊరూవాడా వినాయక నామస్మరణతో మారుమ్రోగుతోంది. ప్రతి గ్రామంలో గణపతి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

- IIలో▸



పేకాటరాయుళ్లు అరెస్టు

కుయింబపురు గ్రామంలో కొద్ది రోజులుగా రహస్యంగా నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 12 మంది జూదగాళ్లను అరెస్టు చేశారు.

- IIలో▸

ఊరు ఏరయ్యింది..!

గంజాం జిల్లాను వరదలు ముంచెత్తుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రుశికుల్యా నదితో పాటు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీని ఫలితంగా చుట్టుపక్కల గ్రామాలతో పాటు నగర వీధులు, కాలనీలు జలమయమయ్యాయి. కవిసూర్యనగర్, పురుషోత్తపురం, బుగడా సమితి పరిధిల్లో గల లోతట్టు గ్రామాల్లోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అలాగే పంటలు నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

– బరంపురం



కవిసూర్యనగర్‌లో వరద నీరు దాటుతున్న ప్రజలు



అస్కా మెయిన్ రోడ్‌లో ముంచెత్తిన వరద నీరు



బుగడా కాలనీలో వరద నీరు



వరద నీటిలో స్థానికుల అవస్థలు



పురుషోత్తంపురం పంద్యాలో ప్రవహిస్తున్న నీరు

న్యూస్‌రీల్

కూలిన హాస్టల్ గోడ



హాస్టల్ గోడ కూలిన దృశ్యం

పర్లాకిమిడి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు రాయగడ బ్లాక్ గంగాబడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల హాస్టల్ గోడ కూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి అపాయం కలగలేదు. 1960లో ప్రారంభమైన ఈ హాస్టల్ గోడ వర్షాలకు మంగళవారం కూలింది. దీంతో పాఠశాలను బుధవారం ఉదయం కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, డీఈవో ప్రదోష్ కుమార్‌నాయక్, రాయఘడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, తహసీల్దార్ లీలావతి ఆచార్య తదితరులు పరిశీలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కొండను ఢీకొన్న బస్సు

రాయగడ: రాయగడ నుంచి కొరాపుట్ వెళ్తున్న జగాబలియా అనే ప్రైవేటు బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అందిన సమాచారం మేరకు.. ప్రైవేటు బస్సు రాయగడ బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరింది. సుమారు ఐదు కిలోమీటర్లు గల హలువ గ్రామానికి చేరేసరికి అదుపుతప్పి, పక్కనే ఉన్న టువంటి కొండను ఢీకొంది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

రాజ్యాంగ సవరణకు బీజేడీ మద్దతు



మాట్లాడుతున్న ఎంపీ రాజశ్రీ మల్లిక్

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ బిజూ జనతాదళ్ లోక్‌సభ సభ్యురాలు రాజశ్రీ మల్లిక్ లోక్‌సభలో 128వ రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు తెలిపారు. మూడంచెల పంచాయతీ రాజ్ సంస్థల్లో 33 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడంలో దివంగత బిజూ పట్నాయక్ తీసుకున్న చర్యల గురించి ఎంపీ ఈ సందర్భంగా ప్రస్తావించడం విశేషం. ఆ తర్వాత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పంచాయతీ రాజ్ సంస్థల్లో రిజర్వేషన్‌ను 50 శాతానికి పెంచారన్నారు. ఈ బిల్లు కోసం 2018–19 కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మరియు పార్టీ ప్రముఖులను ప్రత్యక్షంగా సంప్రదించేందుకు నిరవధికంగా కృషి చేశారన్నారు. పలువురు బిజూ జనతా దళ్ (బీజేడీ) నాయకులు ముఖ్యమంత్రి సూచన మేరకు దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు, పార్టీ ప్రముఖులను సంప్రదించి చట్ట సభల్లో మహిళల రిజర్వేషను బిల్లు కోసం చైతన్య పరిచినట్లు రాజశ్రీ మల్లిక్ లోక్ సభలో తెలిపారు.

నీట మునిగిన పంట పొలాలు



పంట పొలాలు నీట మునిగిన దృశ్యం

భువనేశ్వర్: పూరీ జిల్లా కొణాస్ మండలంలోని బొడాస్, దోకొంద, పాండియకెర పంచాయతీల్లో వందలాది హెక్టార్ల వ్యవసాయ భూములు వరద నీటిలో మునిగాయి. మండలంలోని దయా, రాజువా నదులు వరద నీటితో ఉప్పొంగుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొణాస్ దయా, రాజువా నదుల్లో ఈ ఏడాది వరద నీరు పొంగి పొర్లడం వరుసగా ఇది రెండోసారి. ఇదివరకే వచ్చిన వరదల నుంచి జరిగిన నష్టం నుంచి కోలుకోక ముందే రైతులు మరో ముంపునకు గురై ఆందోళన చెందుతున్నారు. కాగా వరి, వంకాయ, దోస, బెండ, కాకర, ముల్లంగి, పొట్ల కాయలు, పచ్చి మిర్చి వంటి పలు పంటలు నీటిలో మునిగిపోయాయి. ఈ పరిస్థితి తమ ఆర్థిక స్థైర్యం దీలా పరుస్తుందని రైతాంగం వాపోతోంది.

స్పీకర్ అభ్యర్థిగా ప్రమీలా మల్లిక్

- నేడు నామినేషన్ దాఖలు



ప్రమీల మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) అభ్యర్థిగా సీనియర్ నాయకురాలు, రెవెన్యూ – విపత్తు నిర్వహణ శాఖ మంత్రి ప్రమీలా మల్లిక్ బరిలోకి దిగనున్నారు. బీజేడీ తన అభ్యర్థిగా ప్రమీలను బుధవారం ప్రకటించింది. గత కొన్ని రోజులుగా అసెంబ్లీ స్పీకర్ అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. 22వ తేదీన స్పీకర్ ఎన్నిక జరగనున్న తరుణంలో గురువారం నామినేషన్ దస్తావేజులు దాఖలు చేయనున్నారు.

ఎన్నిక ఏకగ్రీవం..?

ప్రమీల బింఝార్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే. 2000 సంవత్సరం నుంచి ఆమె బీజేడీ అభ్యర్థిగా పోటీచేస్తూ వరుసగా విజేతగా నిలవడం విశేషం. రాష్ట్ర మంత్రి వర్గంలో పలు బాధ్యతల నిర్వహణలో దక్షత చాటుకున్నారు. తాజాగా బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ ఆమెకి రాజ్యాంగబద్ధంగా ప్రతిష్టాత్మక స్పీకర్ పదవికి ప్రతిపాదించారు. అసెంబ్లీలో అధికార పార్టీకి అఖండ మెజారిటీ ఉండడంతో ప్రమీల మల్లిక్ గెలుపు ఖాయంగా కనిపిస్తోంది. స్పీకర్‌గా ప్రమీల మల్లిక్ ఎన్నిక సుమారు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

తొలి మహిళా స్పీకర్

రాష్ట్ర శాసనసభ చరిత్రలో తొలిసారిగా ఒక మహిళ స్పీకర్ పదవిని చేపట్టనున్నారు. ఈనెల 22వ తేదీ ఉదయం 9.30 గంటలు స్పీకర్ ఎన్నికను ముహూర్తం. లోగడ ఈ ఎన్నిక సెప్టెంబర్ 21న జరుగుతుందని మొదట ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈనెల 18న నామినేషన్ దాఖలుకు గడువు కేటాయించారు. అయితే పశ్చిమ ఒడిశాలో ప్రముఖ వ్యవసాయ పండగ అయిన నుఖాయ్ రోజుల్లో స్పీకర్ ఎన్నికల్లో పాల్గొనేది లేదని విపక్షాలు తెగేసి చెప్పాయి. ప్రకటించిన ప్రకారం ఎన్నిక జరిగితే తాము బహిష్కరిస్తామని ఉభయ బీజేపీ, కాంగ్రెసు పార్టీలు బాహాటంగా ప్రకటించాయి. దీంతో శాసన సభ స్పీకరు ఎన్నిక సెప్టెంబర్ 22న నిర్ణయించి, నామినేషను దాఖలు ఈనెల 21న చేయాల్సి ఉంటుందని ప్రకటించారు. విక్రమ్ కేశరి అరూఖ్ రాజీనామా తర్వాత స్పీకర్ పదవి ఖాళీ అయింది. తదుపరి స్పీకర్ ఎవరు అనే దానిపై చాలా చర్చ జరిగింది. రాష్ట్రానికి తదుపరి స్పీకర్‌గా మహిళ రావడం చర్చనీయాంశమైంది. మే 12న విక్రమ్ కేశరి అరూఖ్ వ్యక్తిగత కారణాలతో స్పీకర్ పదవికి రాజీనామా చేయడం గమనార్హం. ఆ తర్వాత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఆర్థిక మంత్రిగా బాధ్యతలు అప్పగించింది.

కలుస్తానని పిలిచి కిడ్నాప్



పట్టుబడిన నిందితుడు నాగ్

జయపురం: బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని కలుస్తానని పిలిచి కిడ్నాప్ చేసిన ఘటన జయపురంలో చోటుచేసుకుంది. సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ తండి తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రం రోహితార్ జిల్లా షేక్ బాహుబర గ్రామానికి చెందిన అలోక్ కుమార్ పాశ్వాన్ తనను కొంతమంది కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు చేశాడు. జయపురం నుంచి ఒక గుర్తు తెలియని వ్యక్తి గత నెలన్నర రోజులుగా తనకు ఫోన్‌చేస్తూ జయపురంలో రమ్మని కోరినట్లు వెల్లడించారు. అతడి అభ్యర్థన మేరకు తాను విశాఖపట్నం వచ్చి అక్కడ నుంచి ట్రైన్‌లో ఈనెల 17వ తేదీ ఉదయం 4 గంటలకు జయపురంలో దిగానని పేర్కొన్నారు. తనను రిసీవ్ చేసుకునేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చి ద్విచక్ర వాహనంపై వేరే ప్రాంతానికి తీసుకెళ్లారని, ఆ ప్రాంతంలో మరో ఇద్దరు వ్యక్తులు అప్పటికే వేచి ఉన్నట్లు ఫిర్యాదులో వెల్లడించారు. వారు తనను ఒక ఇంటిలో ఉంచి రూ.2 లక్షలు డిమాండ్ చేశారని, కానీ తన వద్ద లేవంటే కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తెప్పించమన్నారని తెలిపారు. మరో మార్గంలేక తాను తన తండ్రికి ఫోన్‌చేసి విషయం తెలిపి డబ్బు పంపమన్నానని చెప్పాడు. తన తండ్రి పోన్ పేలో రూ.40 వేలు పంపారని వెల్లడించారు. తనను మరో ప్రాంతానికి తీసుకెళ్లారని, అక్కడ నుంచి మిగతా డబ్బు కూడా వెంటనే తెప్పించమని చెప్పి, డబ్బు తెప్పించకపోతే చంపుతామని హెచ్చరించారని ఫిర్యాదులో వెల్లడించినట్లు తెలిపారు. తన వద్దనున్న ఫోన్, రూ.10 వేలు సైతం తీసుకున్నారన్నారు. ఆ రాత్రి అక్కడే ఉంచగా, 18వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు వారి నుంచి తప్పించుకున్నానని వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు జయపురం సమితి గొడాపాదర్ గ్రామం హరిజన వీధికి చెందిన గుప్త నాగ్ కుమారుడు నరేంద్ర నాగ్ ఉరఫ్ నాగ్(20)ను బుధవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి దొంగలించిన డబ్బు, ఫోన్ స్వాధీనం చేసుకొని, కోర్టుకు తరలించారు.

విద్యార్థి సంఘం ఎన్నికలపై కేసు దాఖలు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో కేసు దాఖలైంది. ఎన్నికలపై అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఏడాది విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆ సంస్థ హైకోర్టును అభ్యర్థించింది. ఇందులో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాలలు – సామూహిక విద్యా శాఖ కార్యదర్శి, విద్యాశాఖ సంచాలకులను ప్రత్యర్థులుగా పేర్కొంది. ఈ ఏడాది విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి జారీ చేసిన క్యాలెండర్‌లో ఎన్నికల తేదీ ప్రస్తావన లేదు. అయితే ఈ ఎన్నికలు నిర్వహించాలని ఏబీవీపీ, విద్యార్థి కాంగ్రెస్‌లు డిమాండ్ చేస్తున్నాయి. కాగా ఈ ఏడాది ఎన్నికలు ఉండవని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వరుసగా ఆరో ఏడాది యూనివర్సిటీ, కాలేజీ క్యాంపస్‌లలో విద్యార్థి సంఘం ఎన్నికలు జరగకపోయే అవకాశం ఉందని పిటిషనర్ వర్గం వివరించింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో క్యాంపస్ ఎన్నికలు నిర్వహించి విద్యార్థులు, యువజన సంఘాల్లో చీలిక తెచ్చేందుకు అధికార పార్టీ ఇష్టపడడం లేదు. అందుకే క్యాంపస్ ఎన్నికలకు దూరంగా ఉండేందుకు ఉన్నత విద్యాశాఖ ఏటా ప్రచురించే విద్యా క్యాలెండర్‌ను చాలా చాకచక్యంగా ప్రచురించింది. ఈ సంవత్సరపు సెలవు రోజుల ప్రస్తావన ఉంది, కానీ ఈ క్యాలెండర్‌లో విద్యార్థి సంఘం ఎన్నికల గురించి ఎటువంటి సమాచారం లేనట్లు చూపింది. దీన్ని బట్టి ఈసారి ఒడిశాలో విద్యార్థి సంఘం ఎన్నికలు జరగవని స్పష్టం అవుతుంది. అదేవిధంగా, సెమిస్టర్ (2వ/4వ/6వ) పరీక్ష మే 2024 రెండో వారంలో నిర్వహించి వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు నవంబర్ 1 నుంచి 10వ తేదీ మధ్య నిర్వహించబడతాయి.

సన్మానం



కిశోర్‌చంద్రను సన్మానిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా విశ్రాంత ఎక్సైజ్ ఎస్ఐ కిశోర్ చంద్ర రథ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక బహుమతులను సాధించాడు. ఇటీవల భూటన్‌లో జరిగిన ఆసియన్ గేమ్స్‌లో పరుగు పందెం, లాంగ్ జంప్‌లో బంగారు పతకం సాధించినందుకు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కటక్‌లో ఘనంగా సన్మానించారు.

పుంజుకుంటున్న వర్షపాతం

భువనేశ్వర్: రాష్ట్రంలో సగటు వర్షపాతం పుంజుకుంటోంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో కొరత ఈ నెలలో భర్తీ అవుతోంది. ఈనెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో 258 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది, ఇది సాధారణ వర్షపాతం 176.7 మిల్లీ మీటర్ల కంటే 46 శాతం ఎక్కువ. దీనితో పాటు సెప్టెంబర్ నెల మొత్తం సాధారణ వర్షపాతం మొదటి 20 రోజుల్లో 235.7 మిల్లీ మీటర్లకు మించి నమోదైంది. గత 24 గంటల్లో రాష్ట్రంలో సగటు వర్షపాతం 21.6 మిల్లీ మీటర్లు నమోదైంది. ప్రాంతీయ వాతావరణ కేంద్రం జారీ చేసిన సమాచారం ప్రకారం గత 24 గంటల్లో కొరాపుట్ జిల్లాలో అత్యధికంగా 73.8 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డు అయింది. ఇది సాధారణ సగటు వర్షపాతం కంటే 61 శాతం అధికంగా వాతావరణ కేంద్రం సమాచారం. ఈ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 9.7 మిల్లీ మీటర్లకు పరిమితం. గత 24 గంటల్లో మొత్తం నాలుగు మండలాల్లో 100 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. కొరాపుట్ – 168.0 మిల్లీ మీటర్లు, నందాపూర్ – 137.0 మిల్లీ మీటర్లు, సిమిలిగూడ – 103.0 మిల్లీ మీటర్లు మరియు జయపురం – 100.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

ఘాట్ రోడ్డులో ట్రక్కు బోల్తా



అదుపు తప్పి బోల్తాపడిన ట్రక్కు

జయపురం: విశాఖపట్నం–రాంచీ 326 జాతీయ రహదారి బొయిపరిగుడ–గోవిందపల్లి మార్గం లొంగలొపకన ఘాట్ రోడ్డులో బుధవారం ఒక ట్రక్కు బోల్తాపడింది. బొయిపరిగుడ సమితి లొంగలొపకన ఘాట్ రోడ్డులో బొగ్గు రవాణా చేస్తున్న ట్రక్కు మలుపు తిరుగుతున్న సమయంలో అదుపు తప్పి బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదంలో ట్రక్కు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా ఆ ప్రాంత ప్రజలు అతడిని వెంటనే గోవిందపల్లి కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ ఘాట్ రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెలలోనే దాదాపు మూడు ట్రక్కులు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అయితే ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసులు, సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాగావళిలో యువకుడు గల్లంతు





సంఘటన స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) అశోక్(ఫైల్)

రాయగడ: స్థానిక చెక్కాగుడ సమీపంలోని నాగావళి నదిలో వినాయక నిమజ్జనం సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది. మంకొడొజొల ప్రాంతానికి చెందిన ఎస్.అశోక్ కుమార్ (32) నిమజ్జనం సందర్భంగా గల్లంతయ్యాడు. బుధవారం మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో అశోక్, తన తల్లి ఇంటిలో పూజించే వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు చెక్కాగుడ సమీపంలోని నాగావళి నది వద్దకు వెళ్లారు. ముందుగా అతడి తల్లి నది ఒడ్డుపై నిల్చొని ఉండగా విగ్రహాన్ని తీసుకుని వెళ్లి అశోక్ నిమజ్జనం చేశాడు. అనంతరం పూలు ఇతర వస్తువులను తిరిగి నదిలో కలిపేందుకు వెళ్లి నదిలో కొంతలోతుకు దిగాడు. దీంతో కాలుజారి నదిలో కొట్టుకుపోయాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో అక్కడ ఉన్నవారు సంఘటన స్థలానికి వెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు. అయితే చీకటి పడినా గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించలేదు.

పెట్రోల్ బంక్‌లపై అధికారుల దాడులు



బంక్‌లపై దాడులు నిర్వహిస్తున్న అధికారులు

జయపురం: నగరంలోని పెట్రోలు బంక్‌లపై అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రతాప్ కుమార్ పారిడ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పడి పట్టణంలో మూడు పెట్రోలు బంక్‌లపై దాడులు నిర్వహించారు. బంక్‌లో పెట్రోలు, డీజిల్ క్వాలిటీ, కొలతలు మొదలగు వాటిని పరిశీలించారు. జయపురం బస్టాండ్ సమీప జయపురం సర్వీస్ సెంటర్, గాంధీ కూడలి వద్దనున్న ప్రకాశ అండ్ కంపెనీ పెట్రోల్ బంక్, క్రిస్టియన్ పేటలో ఉన్న కలియ పెట్రోల్ సర్వీస్ సెంటర్ బంక్‌లపై దాడులు చేశారు. దాడులు జరిపిన టీమ్‌లో అదనపు సివిల్ సప్లయ్ అధికారి సునీల్ కుమార్ జెన, సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ హరిచరణ్ మల్లిక్, జయపురం అదనపు తహసీల్దార్ మనోరంజన్ సున, వైట్ అండ్ మేజర్స్ విభాగ డిప్యూటీ కంట్రోలర్ సత్యజిత్ బిశ్వాల్, ప్రభుత్వ కంట్రోలర్ బిజయ కుమార్ నాయిక్, అసిస్టెంట్ అధికారి రఘునాథ్ కంట తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. బుధవారం వేకువజామున బరంపురం వైపు వెళ్లే డౌన్‌లైన్ ట్రాక్‌లో పాతాళ సిద్ధేశ్వరాలయం సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని, గుర్తుపట్టలేని విధంగా శరీరం ఛిద్రమైందని పేర్కొన్నారు. నలుపు ఫ్యాంట్, టీషర్ట్ ధరించి ఉన్నాడని, కుడిచేతికి సిల్వర్ కడియం, ఫ్యాంట్ జేబులో బైక్ కీ ఉన్నట్లు గుర్తించిదామని తెలిపారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో బన్నువాడకు వెళ్లేదారిలో ఎరువుల దుకాణాల వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. బుధవారం ఉదయం సంబంధిత షాపు యజమాని వచ్చేసారికి గుర్తుతెలియని వ్యక్తి దుప్పటి కప్పుకుని పడుకుని ఉండటం గుర్తించారు. ఎంత లేపినా స్పందించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వ్యక్తి మృతిచెందాడని, మృతుడు యాచకుడని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నేడు గురజాడ జయంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: యుగ కవి గురజాడ అప్పారావు 121వ జయంతి సభ గురువారం సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళం ఎన్జీవో హోంలో నిర్వహిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షులు, రచయిత, సాహితీ విమర్శకులు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. గురజాడ అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నూరుల్‌కమార్‌ను డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల అంశాలను ప్రస్తావించారు.

కుళ్లు తెగులుపై అప్రమత్తం



జమ్ము వద్ద వరి పిలకలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నరసన్నపేట: వాతావరణంలో మార్పుల కారణంగా వరి పైరును కుళ్లు, పొడ తెగులు, ఆకుముడత వంటి తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలస రైతు శిక్షణా కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త ఉదయబాబుతో కలిసి బుధవారం నరసన్నపేట మండలం జమ్ము తదితర గ్రామాల పరిధిలోని వరి పైర్లు పరిశీలించారు. కొన్నిచోట్ల కుళ్లు తెగులు, ఆకుముడత కనిపిస్తోందని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి తెగుళ్లు నిర్మూలించుకోవాలని సూచించారు. అజాగ్రత్తగా ఉంటే నష్టం తప్పదన్నారు. పరిశీలనలో నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత ఉన్నారు.

పశువుల కంటైనర్ సీజ్

జలుమూరు: నారాయణవలస సంత నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 79 పశువులతో కూడిన కంటైనర్‌ను సీజ్ చేశామని ఎస్‌ఐ పి.పారినాయుడు బుధవారం తెలిపారు. ఎస్‌ఈబీ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు లింగాలవలస వద్ద మాటువేసి కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని పశువులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనలో రాజస్థాన్‌కు చెందిన సలీమ్, హర్యానాకు చెందిన మొఫిద్దస్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

22న పాతపట్నంలో జగనన్నకు చెబుదాం

పాతపట్నం: మండలంలోని తహసీల్దార్ కార్యాయలంలో ఈ నెల 22న ఉదయం పది గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎం.నవీన్‌కుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రజల వినతులు స్వీకరించి, తక్షణమే పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం దోహదపడుతుందన్నారు.

జనావాసాల్లో జాగ్రత్తగా నడపాలి

టెక్కలి రూరల్: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సరుకులు రవాణా చేసే వాహనాలు జనావాసాలను ఆనుకుని వెళ్లేటప్పుడు వేగ నియంత్రణ పాటించాలని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో పోర్టు ట్రాన్స్‌పోర్టు వాహన యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్లు వంటి ముడి సరుకులు తీసుకువెళ్లే వాహనాలు పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి లోడ్ వెయ్యరాదన్నారు. ప్రజలు భయాదోళన గురయ్యేలా వాహనాలు నడపరాదని సూచించారు. లోడ్ బయటకు కనిపించకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మూలపేట మూడురోడ్ల జంక్షన్ వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ చేస్తామన్నారు. సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

వరములివ్వు వినాయక

- కొనసాగుతున్న ఉత్సవాలు

ఊరూవాడా వినాయక నామస్మరణతో మారుమ్రోగుతోంది. ప్రతి గ్రామంలో గణపతి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు జోరందుకున్నాయి. కాగా కొన్ని గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు సైతం జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్ నగరంలో ఏర్పాటు చేసిన గణపయ్యను దర్శించుకుంటున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్




భువనేశ్వర్: పూజలు అందుకుంటున్న వృక్ష గణపతి



పర్లాకిమిడి: విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం



రాయగడ పట్టణంలో....



రాయగడ: శ్రీజగన్నాథుడి రూపంలో దర్శనమిస్తున్న గణపయ్య



పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ కొలువైన గణపయ్య




బరంపురం: అస్కా రోడ్‌లో...



భువనేశ్వర్: శైలశ్రీ విహార్‌లో వెలసిన అతిపెద్ద గణపతి ప్రతిమ



రాయగడ: తల్లిసేవ చేస్తున్నట్లు తీర్చిదిద్దిన గణపతి విగ్రహం



రాయగడ: గుణుపూర్ పాత బస్టాండ్ కూడలిలో...



జయపురం: ఎంజీ రోడ్డులో...



బరంపురం: గుసానినువగాంలో...




బరంపురం: గాంధీనగర్‌లో...



బరంపురం: పార్క్ వీధిలో...



జయపురం: దైనిక బజారులో...



జయపురం: మహారాణిపేటలో...



జయపురం: సోంబారు తోటలో...



బరంపురం: కళికోట్ కళాశాలలో...

అన్నదాతకు రుణపతి

- 2023-24లో పంటలవారీగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో పెంపు
- భారీగా లబ్ధి పొందనున్న సన్న, చిన్నకారు రైతులు



వరి దమ్ము చేస్తున్న రైతు

కవిటి : ఆరుగాలం శ్రమించే అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన రుణపరపతి కల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటలకు అందించే రుణాలను జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ(డీఎల్‌టీసీ) ఇటీవల వెల్లడించింది. ఈ నేపథ్యంలో పెరిగిన సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను సవరించిన కొత్తజాబితా జిల్లా కలెక్టర్ ఆమోదంతో అమల్లోకి వచ్చింది. కూలీల రేట్లు, ఇతర పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిన ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రుణపరపతి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ 2019 ఖరీఫ్ నుంచి సవరించిన మార్గదర్శకాల మేరకు పంట రుణం మొత్తాన్ని ఎటువంటి పూచీకత్తులు సమర్పించకుండానే రూ.1.60 లక్షలు పొందే వీలు కల్పించింది. తాజా నిర్ణయంతో జిల్లాలో వరి సాగు చేసే సుమారు 4.50 లక్షల మంది సన్న, చిన్నకారు, పెద్ద రైతులకు ప్రయోజనం కలగనుంది. 32565 ఎకరాల్లో కొబ్బరి సాగుచేస్తున్న 2.12 లక్షలమంది కొబ్బరి రైతులకు సైతం ఈ పెంపుదల లాభించనుంది.

పంటరకం	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (2022-23)	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (2023-24)
వరి	38000-40000	42000-45000
జొన్న	18,000-20,000	19000-21000
రాగి	14,000-18,000	16000-20000
ఆయిల్‌పాం	47,300-51700	55000-60000
కందులు	16000-20000	18000-22000
మినుములు	15000-18000	18000-20000
పెసలు	15000-18000	18000-20000
వేరుశెనగ	30000-32000	32000-35000
కొబ్బరి	33000-44000	44000-47000
అరటి	60,500-77,000	65000-80000
చెరకు	71500-75900	77000-80000
జీడి మామిడి	28000-30000	30000-35000

పెంపునిర్ణయం వర్తించేదిలా..

వ్యవసాయానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో పంట రుణాలను ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో అందిస్తున్నారు. ఈ రుణాలతో పాటు వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలు, ట్రాక్టర్ల కొనుగోలు తదితర రకాలైన రుణాలను సైతం అందజేస్తున్నారు. ఈ విధానంలో గత ప్రభుత్వ హయాంలో చివరి రబీ సీజన్(2018-19)లో రూ.లక్ష వరకు పంట రుణాల గరిష్ట అవధి ఎటువంటి పూచీకత్తులు లేకుండా బ్యాంక్‌లో 1బీ, అడంగల్ అందిస్తే తక్షణమే రైతుకున్న భూమి విస్తీర్ణం ఆధారంగా గరిష్టంగా పంటరుణం అందించేవారు. ప్రస్తుతం అదే పంటరుణాలు కేవలం అడంగల్, 1బీలను దాఖలుచేసి గరిష్టంగా రూ.1.60 లక్షలకు పెంచడం ద్వారా అధిక శాతం రైతులకు ప్రయోజనం చేకూరింది. గతంలో రూ.లక్ష కన్నా అధిక మొత్తం పంట రుణం కావాలంటే మిగిలిన మొత్తానికి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో తమ భూమిని రుణం తీసుకునే బ్యాంకులో మార్టుగేజ్ చేయాల్సి ఉండేది. తాజా పెంపు నిర్ణయంతో మార్టుగేజ్ అవసరం లేకుండానే కేవలం 1బీ అడంగల్, పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలు బ్యాంకుకు అందిస్తే తక్షణమే సంబంధిత మేనేజర్ రుణాల్ని ఇచ్చేవీలుంది. ఇటీవల డీఎల్‌టీసీ రూపొందించిన రుణవితరణ జాబితా 2023-24 ఆర్థికసంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు వర్తింపజేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



రిజర్వ్ బ్యాంక్ వ్యవసాయ రంగంలో వచ్చిన పంట పెట్టుబడులు, రాబడి, ఖర్చులు, ద్రవ్యోల్బణం తదితర అంశాలను ప్రామాణికంగా పంటరుణానికి నిర్దేశించిన పంటలకు కొత్తస్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లను సూచిస్తూ పెంపుదల చేసింది. ఇందుకు సంబంధించి బ్యాంకులకు మార్గదర్శకాలు కూడా వెలువరించింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యాల్ని ఖరీఫ్ సీజన్‌కు పూర్తిచేయగలిగాం. – సూర్యకిరణ్, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, శ్రీకాకుళం

తక్కువ డాక్యుమెంటేషన్‌తోనే..



రైతులు పంట పెట్టుబడి కోసం బ్యాంకులు ఇస్తున్న రుణం ఆందోళన లేనిది. స్వల్పకాలిక పంట రుణం రూ.1.60 లక్షల వరకు 7 శాతం వడ్డీ ఎంతో మేలు. క్రాప్‌లోన్ తీసుకుని వ్యవసాయ అవసరాలకు అధిక మొత్తం కావాల్సిన సందర్భంలో కూడా కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఎస్‌టీ లోన్లు కూడా అతి తక్కువ డాక్యుమెంటేషన్‌తోనే రుణం అందుతోంది. – బొర్ర రమేష్, రైతు, చండిపుట్టుగ

శతశాతం ఖరీఫ్ రుణాల మంజూరు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో వ్యవసాయ రుణ ప్రణాళికను ప్రకటించారు. ఇందులో ఖరీఫ్ సీజన్‌కు గానూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంటరుణాలు, వ్యవసాయ ఇన్‌ఫ్రా రుణాలు యాన్సిలరీ యాక్టివిటీ రుణాలన్నీ కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.4068 కోట్లుగా నిర్ధారించారు. అయితే ఈ ఏడాది ఆగస్టు 31 నాటికే శతశాతం లక్ష్యాల్ని పూర్తి చేశారు. అదేవిధంగా ఈ ఏడాది రబీ సీజన్‌కు రూ.2712 కోట్లుగా రుణలక్ష్యాన్ని నిర్దేశించారు.

తల్లిదండ్రుల పాత్ర గురుతరమైనది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర గురుతరమైనదని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సమితి అంబాగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లల బాధ్యతలు తల్లిదండ్రులు తీసుకొని, సక్రమంగా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. 5టీ పథకంలో భాగంగా పాఠశాలలో ఆడిటోరియం, సైకిల్ స్టాండ్, కామన్ రూం, శౌచాలయం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆడిటోరియం నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. హెచ్‌ఎం సునీల్ కుమార్ పాఢి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ దీప్తి హాకాక, సమితి సభ్యులు సుస్మిత తరణీ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి శతపతి, సబిత నాయిక్, రేబిక బాగ్, మీనతి కుమారి నాయిక్, ప్రభావతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు, (ఇన్‌సెట్‌లో) నగదు మరియు ఇతర సామగ్రి

బరంపురం: కుయింబపురు గ్రామంలో కొద్ది రోజులుగా రహస్యంగా నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 12 మంది జూదగాళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి సుమిత్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. గంజాం పోలీసుస్టేషన్ పరిధి కుయింబపురు గ్రామంలోని ఒక ఇంటిలో రహస్యంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం జూదం అడ్డాపై దాడిచేసి 12 మందిని అరెస్టు చేశారు. అలాగే రూ.77 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, 2 పేక కట్టలు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామంలో పీడీఎఫ్ బియ్యం తరలిస్తుండగా సీఎస్‌డీటీ జయలక్ష్మి బుధవారం పట్టుకున్నారు. సీహెచ్.నారాయణరావు అనే వ్యక్తి గ్రామంలో లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న సమయంలో స్థానికులు సమాచారం అందించడంతో 120 కేజీలు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ చెప్పారు.

మరో కేసులో 1700 కిలోల పట్టివేత



రామభద్రపురం: ఇట్లామామిడిపల్లిలో పట్టుబడిన బియ్యంతో విజిలెన్స్ అధికారులు

రామభద్రపురం: మండలంలోని ఇట్లామామిడిపల్లి గ్రామంలో ఓ ఇంటి వరండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 1700 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వారణాసి కళావతి లబ్ధిదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన రూ.64,600 విలువ చేసే 1700 కిలోల పీడీఎస్ (పోర్టిఫైడ్) బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు గ్రామంలో తనిఖీ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీఎస్‌డీటీ సాయికృష్ణకు అప్పగించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై బి.సింహాచలం సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దాయికి జైలు శిక్ష

సంతకవిటి: మండలంలోని రామారాయపురం గ్రామానికి చెందిన భార్యాభర్తల తగాదాలో భర్త బొడ్డేపల్లి శివకు 6నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. 2017లో భర్తపైన భార్య కేసు పెట్టడంతో అప్పటి ఎస్సై కె.రామారావు నమోదు చేశారని ఎస్సై బి.లోకేశ్వరరావు చెప్పారు. ఈ కేసు బుధవారం హియరింగ్‌కు రావడంతో ఏపీపీ కిమిడి సూర్యారావు వాదనలు వినిపించారన్నారు.

వేధింపుల కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెంది గుణుపూరు సూర్యారావుపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ ఎస్.దుర్గా ప్రసాదరావు తెలిపారు. సూర్యారావు కొన్ని రోజుల నుంచి వెంట పడి ఇబ్బంది పెడుతున్నాడని, తనకు వస్తున్న పెళ్లి సంబంధాలు చెడగొడుతున్నాడని, తన తండ్రిపై బుధవారం ఉదయం కర్రతో దాడి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

గుణుపూరు సూర్యారావుతో పాటు కొంతమంది తన తండ్రిపై దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనగా ఆరుగురిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: విధులు ముగించుకుని వేకువజామున ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు అడ్డగించి, కత్తితో బెదిరించి, డబ్బులు దొరక్కపోయేసరికి మొబైల్‌ను పట్టుకుని పరారైన వారిలో ఒక నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జేఎన్‌టీయూ సమీపంలో ఉన్న కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.రవి ఈ నెల 16న విధులు ముగించుకుని వేకువజామున నడుచుకుంటూ కేఎల్‌పురంలోని ఇంటికి వెళ్తుండగా ఆర్‌టీఓ కార్యాలయం సమీపానికి వచ్చేసరికి పడమటి బలిజవీధికి చెందిన దుర్గాప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు అడ్డగించి తీవ్రంగా చితక్కొట్టి, డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బుల్లేకపోయేసరికి కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కుని బైక్‌పై పారిపోయారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిఘా పెట్టిన పోలీసులు నిందితుడు దుర్గాప్రసాద్‌ను నాగవంశంవీధి వద్ద మంగళవారం అదుపులోకి తీసుకుని, వన్‌ప్లస్ మొబైల్ రికవరీ చేశారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై పోక్సో కేసు నమోదు

చీపురుపల్లి: అమ్మాయికి 14 సంవత్సరాలు..అబ్బాయికి 18 సంవత్సరాలు ఇద్దరూ మైనర్లే అయినప్పటికీ చాలా దూరం వెళ్లిపోయారు. పల్లె వాతావరణంలో జన్మించిన వారిని ఇన్‌స్ట్రాగామ్ కలిపి తప్పుడు మార్గంలో నడిపించింది. అమ్మాయి కంటే అబ్బాయి నాలుగేళ్లు పెద్దవాడు కావడంతో ప్రేమ, ఇష్టం, పెళ్లి అంటూ నాలుగు మాటలు చెప్పడంతో పలుమార్లు శారీరకంగా కలిశారు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో దండించారు. తనకు మాయ మాటలు చెప్పి మోసం చేశాడని తల్లిదండ్రులకు బాలిక వివరించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎ.సన్యాశినాయుడు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి యత్నం

జామి: మండలకేంద్రానికి చెందిన బాలికపై లైంగిదాడికి ఓ వ్యక్తి యత్నించాడు. ఈ విషయమై స్థానికులు తెలిపిన వివరాల మేరకు స్థానికుడైన ఎ.సత్తిబాబు తాగిన మైకంలో బాలికపై లైంగికదాడికి యత్నించాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం



ప్రమాదస్థలంలో రోడ్డుపక్కకు తుళ్లిపోయిన బైక్

- మరొకరి పరిస్థితి విషమం



జక్కువ నుంచి బయలుదేరుతూ మిత్రులు తీసుకున్న సెల్ఫీ



మృతుడు భోగిన సత్యనారాయణ



లచ్చిరెడ్డి రాజు మృతదేహం

విజయనగరం క్రైమ్/గంట్యాడ: స్థానిక కేఎల్ పురం వద్ద మంగళవారం రాత్రి టిప్పర్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఇదే ప్రమాదంలో మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న భోగిన సత్యనారాయణ (32)కు మగపిల్లాడు పుట్టాడు. బాబుకు బారసాల చేసేందుకు సామగ్రి కొనుగోలు కోసం సత్యనారాయణ, మిత్రులు జక్కువ గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి రాజు (25), బొడ్డు గౌరీశంకర్‌లు మంగళవారం సాయంత్రం విజయనగరం వచ్చారు. సామగ్రి కొనుగోలు చేసిన అనంతరం విజయనగరంలో భోజనం చేసి, తర్వాత వారి స్వగ్రామాలకు ద్విచక్రవాహనంపై ముగ్గురూ వెళ్తుండగా ఆర్టీఓ కార్యాలయం నుంచి విజయనగరం వైపు వస్తున్న టిప్పర్ వారి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటనస్థలంలోనే లచ్చిరెడ్డి రాజు మృతిచెందగా మిగిలిన ఇద్దరిని స్థానికులు 108లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో సత్యనారాయణ మృతిచెందాడు. గౌరీశంకర్‌ను మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై గోపాల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జక్కువ, కొంపంగి గ్రామాల్లో విషాదఛాయలు

మెంటాడ మండలంలోని జక్కువ, కొంపంగి గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయా గ్రామాలకు చెందిన యువకులు జిల్లా కేంద్రంలో దుర్మరణం చెందడంతో మృతుల కుటుంబసభ్యుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. చేతికి అందివచ్చిన కుమారులు రహదారి ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకున్న కుటుంబసభ్యులు లబోదిబోమంటుంటే చూపరుల గుండె బరువెక్కింది.

బాబుపుట్టిన 16రోజులకే..

భోగిన.సత్యనారాయణ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య భవాని గజపతినగరం మండలంలోని మధుపాడ గ్రామ సచివాలయంలో మహిళాపోలీస్‌గా విధులు నిర్వహిస్తోంది. వారికి వివాహమై ఏడాది అయింది. ఇటీవల సెప్టెంబర్ 4వతేదీన ఆ దంపతులు బాబు పుట్టాడు.

లచ్చిరెడ్డి రాజు నేపథ్యం..

లచ్చిరెడ్డిరాజు తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లే అన్నీ తానై పెంచింది. అన్నయ్య సీతారాం, వదిన జానకితో కలిసి రాజు ఉంటున్నాడు. రాజు మరుపల్లి గ్రామంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుటుంబానికి సహాయంగా ఉంటున్న రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెండంతో అన్నావదినల రోదన వర్ణనాతీతంగా ఉంది.

సెల్ఫీ హల్‌చల్

గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి బైక్‌పై వెళ్తున్నామని అందరికీ బైబై అంటూ లచ్చిరెడ్డి రాజు వాట్సాప్‌లో పెట్టిన ఫొటో జక్కువ గ్రామ యువతను విషాదంలో ముంచేసింది. బైబై అని పెట్టిన స్టేటస్ అదే మిత్రుడి చివరి స్టేటస్ అవుతుందని ఊహించలేదంటూ మిత్రులందరూ కన్నీటిపర్యంతమయ్యారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి



వృద్ధురాలు పైడితల్లి (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ పరిధి పెదనేర్లవలస గిరిజన గ్రామానికి చెందిన వృద్ధురాలు బోయిన పైడితల్లి అదృశ్యం కాగా ఆమె మృతదేహం గురువారం లభ్యమైంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వృద్ధురాలు పైడితల్లి భర్త ఎర్రప్ప దొరతో కలిసి ఈ నెల 8వ తేదీన కొండకెంగువ పంచాయతీ పరిధిలో గల జీలుగువలస గ్రామానికి శుభకార్యానికి వెళ్లింది. అక్కడి నుంచి భర్త అదే రోజు సొంతూరు వచ్చేశాడు. ఆమె ఆ రోజు అక్కడే ఉండిపోయి 9వ తేదీన గ్రామానికి నడకదారిన బయల్దేరింది. అయితే ఆమె ఇంటికి చేరకపోవడంతో 12 వతేదీ వరకు కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ తెలియరాకపోవడంతో ఈ నెల 13వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తుండగా నేర్లవలస జీలుగువలస మధ్య ఎత్తైన కొండ ప్రాంతంలో బుధవారం ఓ మహిళ మృతదేహం పశువుల కాపర్లకు కనిపించింది. ఈ సమాచారం మేరకు ఎస్సై సురేంద్రనాయుడు సిబ్బందితో వెళ్లి పరిశీలించి ఆ మృతదేహాన్ని అదృశ్యమైన పైడితల్లిదిగా గుర్తించారు. మృతదేహం వద్ద బట్టలు తడిసిపోయి ఉండడంతో పాటు రూ.1200లు చెదపట్టి ఉన్నాయి. నడకదారిన వస్తూ 50 మీటర్ల ఎత్తు కొండపై నుంచి ఆమె జారిపడిపోయినట్లు నిర్ధారించి భర్త ఎర్రప్పదొర ఫిర్యాదు చేయడంతో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

గుర్తు తెలియని మరో వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ సమీపంలోని తుప్పల్లో సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. మృతుని వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ



గుర్తుతెలియని మహిళ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి ఒమ్మి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గాయాలతోపడి ఉన్న మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 19 మండల పరిధి ఒమ్మి గ్రామ సమీపంలో రాజాం-రామభద్రపురం రహదారి పక్కన తలకు గాయాలై గుర్తుతెలియని మహిళ పడి ఉంది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందిందని బుధవారం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు..



ఉపాధ్యాయుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: సీతంపేట మండలం బుడగరాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పాలకొండ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఉంటున్న ఎ.లక్షుమయ్య(58) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సీతంపేటలో కుటుంబంతో సహా ఉండే ఆయన నాలుగు నెలల క్రితం భార్య భాగ్యలక్ష్మి మృతితో పిల్లలను తీసుకునిపాలకొండ వచ్చి కాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఇంటి వద్ద లక్షుమయ్య అపస్మారక స్థితిలో ఉన్నట్లు కుమారుడు ఖగేశ్వరరావు గుర్తించాడు. కాసేపటికి తండ్రి మరణించినట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై బి.శివప్రసాద్ మృతదేహాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి కుమార్తె శ్రావణి ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని గ్రామాలకూ తాగునీరు



ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న అధికారులు

- డీఈలు గోవిందరావు, పైడిరాజు

వేపాడ: ఎస్.కోట నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గల శివారు గ్రామానికి తాగునీరు అందించేందుకు జేజేఎం నిధులు రూ.90 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ఎస్.కోట ప్రాజెక్టు డీఈ వై.గోవిందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కేఆర్‌ఎస్ పైడిరాజు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం వేపాడ మండలంలో మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంకుల ఏర్పాటుకు రామస్వామిపేట, బక్కునాయుడుపేట, చామలాడవి, దొగ్గపేట తదితర గ్రామాలను సందర్శించి అనువైన స్థలాలను పరిశీలించారు. అనంతరం వేపాడ ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జలజీవన్‌మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50శాతం నిధులు మంజూరుచేయడంతో పనులు చేపట్టేందుకు స్థలాలు పరిశీలించినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎస్‌కోట, వేపాడ మండలంలో ఐదు గ్రామాలకు ఎల్‌కోట మండలంలో కొన్ని గ్రామాల్లో తాటిపూడి నీరు పైపులైన్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం వేపాడ, కొత్తవలస మండలాల్లో మిగిలిన గ్రామాలకు అందించేందుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంకు నిర్మాణానికి స్థలాలు పరిశీలిస్తున్నామన్నారు. వేపాడ మండలంలో మారిక గ్రామాన్ని మినహాయించి ప్రతి పంచాయతీ శివారు గ్రామాలకు తాటిపూడి నీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎస్‌ఎన్ కూర్మనాథ్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ప్రాజెక్టు జేఈ బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 17న మసాయిదా ఓటరు జాబితా ప్రచురణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 17న జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను అక్టోబర్ 17న ప్రచురిస్తామని, 17 నుంచి నవంబర్ 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించవచ్చునన్నారు. 2024 జనవరి 1 నాటికి అన్ని అంశాలు సరిచూసి జనవరి 5నాటికి తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నామని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ జె. వెంకట్రావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవికుమార్, వివిద పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర కీలకం

- సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ మహంతి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర నేడు అత్యంత కీలకంగా మారిందని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీకే మహంతి అన్నారు. ఈ మేరకు మండలంలోని సెంచూరియన్ వర్సిటీలో జాతీయ కాన్ఫరెన్స్ ఆన్ ఫోరెన్సిక్ ఫైండ్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ..ఫోరెన్సిక్ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. నేర స్థలం వద్ద ఆధారాల సేకరణపైనే నేరస్థులకు శిక్షపడే అవకాశం ఉంటుందన్నారు. బాధిత వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడంలో ఫోరెన్సిక్ నిపుణులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. త్వరలోనే వర్సిటీలో ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ కోర్సును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ నేర పరిశోధనలో స్పష్టమైన విధానాలను అనుసరించాలని సూచించారు. ఈ సమయంలోనే విద్యార్థులు ఎక్కువ సమయం వెచ్చించి అవగాహన పెంచుకోవాలని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సురేంద్ర కుమార్ పాల్ లైంగిక వేధింపులు-పోక్సో కేసు దర్యాప్తు అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అంకిత్ శ్రీవాస్తవ, ఫోరెన్సిక్ విభాగాధిపతులు నాగజోగయ్య, ప్రవల్లిక పాల్గొన్నారు.

26న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

పాలకొండ: తమ్మినాయుడు కళాశాల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. జాబ్ మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్: 7993795796నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గురజాడ.. భావితరాలకు వెలుగుజాడ

- నేడు గురజాడ 161వ జయంతి
- గురజాడ వాడిన వస్తువులతో ర్యాలీ
- దేశమంటే మట్టికాదోయ్ సామూహిక దేశభక్తి గీతాలాపన
- వేడుకల్లో పాల్గొననున్న ప్రముఖులు



విద్యుత్‌దీపాల అలంకరణలో గురజాడ అప్పారావు గృహం



విజయనగరం టౌన్: మహాకవి గురజాడ...భావితరాలకు వెలుగు జాడ. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం అజరామరం. నేటికీ ఆ మహనీయుడ్ని తలుస్తున్నామంటే ఆయన ఆనాడు చేసిన రచనలే నిదర్శనం. విజయనగర ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. విద్యలనగరమైన విజయనగరంలో సాహితీ సౌరభాలను కురిపించారు. వారిలో గురజాడ ఒకరు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 161వ జయంతిని గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన ఉదయం 9.30 గంటల నుంచి గురజాడ స్వగృహంలో జ్యోతిప్రజ్వలన, చిత్రపటానికి పూలమాలంకరణ జరుగుతుంది. 9.45 గంటలకు గురజాడ ఇంటి నుంచి కాంస్య విగ్రహం వరకూ ఆయన వాడిన వస్తువులతో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. 10 గంటలకు గురజాడ కాంస్య విగ్రహానికి పురప్రముఖులు పూలమాలాలంకరణ, అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులతో గురజాడ కాంస్య విగ్రహం వద్ద 'దేశమంటే మట్టికాదోయ్' సామూహిక గీతాలాపన జరుగుతుంది. 10.15 గంటలకు ప్రముఖులు సందేశాలు వినిపిస్తారు.

మహాకవి గురించి...

సామాజిక సమస్యలపై సాహితీ సమరం పూరించి, విశ్వసాహితీ వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మింపజేసిన సాహితీ సౌరభం మహాకవి గురజాడ వేంకట అప్పారావు. గురజాడ 1862 సెప్టెంబర్ 21న రాయవరంలో జన్మించారు. మహారాజా విద్యాసంస్థల్లో గిడుగు సహ విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. తన 23వ ఏట అప్పలనరసమ్మతో వివాహం జరిగింది. ఆయనకు ఓలేటి లక్ష్మీనరసమ్మ, వెంకట రామదాసు, కొండయ్యమ్మ సంతానం. గురజాడ సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు కన్యాశుల్కం పేరుతో 1892 ఆగస్టు 13న తొలికూర్పును ప్రదర్శించారు. 1897లో ఆనందగజపతికి అంకితం ఇచ్చారు. రెండో కూర్పును 1909లో ప్రచురించారు. అప్పట్లో సంస్కృత భాషకు ఆదరణ ఎక్కువగా ఉండేది. సామాన్యుడికి అర్థమయ్యేలా ముత్యాలసరాలు రచించారు. 1883లో సారంగధర, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, లవణరాజు కల, నీలగిరి పాటలు, కాసులు, కన్యక, సుభద్ర, దించు, లంగరు, తదితర ఎన్నో అద్భుతమైన రచనలు చేశారు. అన్నింటికన్నా ఎవరూ రాయలేని దేశభక్తిగేయాన్ని ఆయన 'దేశమును ప్రేమించుమన్నా.. అంటూ రాసి విమర్శకుల ప్రసంసలు పొందారు. అనారోగ్యంతో 1915 నవంబర్ 30న ఉదయం 8.20 గంటలకు తుదిశ్వాస విడిచారు.

22 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

విజయనగరం క్రైమ్: పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా విశాఖ జోన్‌కి చెందిన ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విశాఖపట్నంలోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో మరోసారి ఈ నెల 22, 23 తేదీల్లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ కె.హరికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25 నుంచి నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకాని మహిళా అభ్యర్థులు 22న, పురుషులు 23న హాజరుకావాలన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు
- పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో అర్జీల స్వీకరణ



గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

పార్వతీపురం టౌన్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజనుల నుంచి బుధవారం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఎస్టీ కమీషన్ ఎల్లవేళలా గిరిజనులకు అందుబాటులో ఉంటుందన్నారు. డీవీజీకి అందిన వినతుల్లో కొన్ని...

- పీసా చట్టం, 1/70 చట్టం, బినామీ గిరిజనులపై చర్యలు, షెడ్యూల్ ప్రాంతం చట్టాలు అమలులో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కె.ధర్మారావు, నీలకంఠం విజ్ఞప్తిచేశారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరారు.
- ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు నివారించే చర్యలు తీసుకోవాలని, అవసరం మేరకు వర్కర్ల నియామకం, సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంఘ నాయకుడు భగవాన్ కోరారు. ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
- జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాల ని, అటవీ ఫలసాయాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జీసీసీకి నిధులు పెంచాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ 5లో చేర్చాలని గిరిజన సంఘ నాయకుడు మండంగి రమణ విన్నవించారు.
- ఐటీడీఏ పీఓ నేతృత్వంలో గిరిజనులకు ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఐటీడీఏ పాలక మండలి సమావేశం నిర్దేశిత సమయంలో నిర్వహించాలని, ఐటీడీఏ నిధులు గిరిజనుల అవసరాలకు మాత్రమే వినియోగించేలా చూడాలని ఉత్తరాంధ్ర గిరిజన సంఘం నాయకుడు బి.రంజి త్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్ కళాశాలలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, పీజీ సెంటర్, జిల్లా కో 'స్టడీ సర్కిల్' ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాలకు 'డైట్ బిల్లులు' చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం కమిటీ తరఫున పి.సురేష్ వినతిపత్రం అందజేశారు.
- రామభద్రపురం మండలం జోగింద్రవలస గ్రామంలో సామాజిక భవనములకు విద్యుత్ సదుపాయం కల్పించాలని గ్రామ ప్రజలు కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డీవీజీకి స్వాగతం

ఎస్టీకమిషన్ చైర్మర్ డీవీజీ శంకరరావుకు కలెక్టర్ నిషాంత్‌కుమార్, పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. గిరిజన సంక్షేమానికి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీఓ తదితరులు